ప్రజాశక్తి

సోమవారం 7 అక్టోబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మద్యం దుకాణాల్లో బినామీల బాగోతం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

- ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో తెరవెనుక తతంగం
- టిడిపి, వైసిపి నేతల భాగస్వామ్యంతో వ్యాపారం?
- దరఖాస్తులకు 9వ తేదీ వరకు గడువు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మద్యం టెండర్లకు భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. ఈనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపేందుకు ఎక్సైజ్‌శాఖ వ్యాపారులకు అవకాశం ఇచ్చింది. ఈసారి మద్యం దుకాణాల కేటాయింపు అంతా స్థానిక ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లోనే జరగనుంది. మొత్తం 14 నియోజకవర్గాల పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు మినహా మిగతా వారంతా తమ బినామీలకే దుకాణాలు కేటాయించేలా కసరత్తు చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి మధ్య ఉన్న స్నేహబంధాలు కూడా మద్యం దుకాణాల కేటాయింపులో కీలక భూమిక పోషించనున్నాయి. వైసిపి వారికి దుకాణం వచ్చినా టిడిపి నేతలకు వాటా ఇచ్చేలా అంతర్గత ఒప్పందాలు జరుగుతున్నాయి.

రెండు జిల్లాల పరిధిలో ఆదివారం రాత్రి వరకు దరఖాస్తులు ఎక్కువగానే వచ్చాయి. మరో మూడు రోజుల పాటు గడువు ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గుంటూరు జిల్లాలో మొత్తం 127 దుకాణాలకు గాను ఇప్పటి వరకు 394 దరఖాస్తులు అందాయి. ఇంకా 15 దుకాణాలకు ఒక్క దరఖాస్తు రాలేదు. 112 దుకాణాలకు గాను ఒక్కో దుకాణానికి సగటున మూడు దరఖాస్తులు వచ్చినట్టు అధికార వర్గాలు తెలిపాయి. మంగళగిరి నియోజకవర్గంలో కొన్ని దుకాణాలకు 10 వరకు దుకాణాలకు వచ్చాయని తెలిసింది. దుకాణం తమకే వస్తుందని తెలిసిన వారు ముందుగానే దుకాణం నిర్వహణకు పక్కా భవనాల ఎంపికలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోనే ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. పల్నాడు జిల్లాలో మొత్తం 129 దుకాణాలకు గాను ఇప్పటి వరకు 224 దరఖాస్తులు వచ్చాయి. ఇంకా 37 దుకాణాలకు ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. పల్నాడు జిల్లా దాచేపల్లి, నడికుడిలో ఉన్న దుకాణాలకు అధిక డిమాండ్ ఏర్పడింది.

రెండు జిల్లాల పరిధిలో 256 మద్యం దుకాణాలకు 2 సంవత్సరాల పరిమితి మేరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు వారి అనుంగు అనుచరల పేరున దరఖాస్తులు చేయిస్తున్నారని తెలిసింది. ఆన్లైన్లో దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తర్వాత ఈనెల 11 వ తారీకున గుంటూరు జిల్లాకు సంబంధించి నగరంలో వెంకటేశ్వర

▶ 2లో

ఆదివారం రాత్రి 7 గంటల వరకు సమాచారం..

గుంటూరు జిల్లా మొత్తం దుకాణాలు : 127

ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు : 394

అసలు దరఖాస్తులు రాని దుకాణాలు : 15

పల్నాడు జిల్లా మొత్తం దుకాణాలు : 129

ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు : 224

ఇప్పటి వరకు దరఖాస్తులు రాని దుకాణాలు : 37

నిరసన తెలియజేస్తున్న తొలగింపునకు గురైన కార్మికులు, నాయకులు

కూటమి ప్రభుత్వం పాలనలో కార్మికులు, ఉద్యోగులకు

వేధింపులు.. తొలగింపులు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వాలు మారితే ఏళ్ల తరబడి పనిచేస్తున్న మమ్మల్ని తొలగిస్తారా? వేతనాలు ఇవ్వకుండా వేధిస్తారా? ఇదెక్కడి న్యాయం అని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తూ రాజకీయ వేధింపులు నేపథ్యంలో తొలగింపునకు గురైన ఉద్యోగులు, కార్మికులు ప్రశ్నిస్తున్నారు. తొలగింపునకు గురైన 53 మంది 5 రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. వీరి నిరసనకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ ఆదివారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఉద్యోగులను, కార్మికులను రాజకీయ వేధిస్తున్నారని విమర్శించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదని అన్నారు. గత 20 ఏళ్లలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి లేదన్నారు. పట్టణీకరణ పెరగడం, జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఆవిర్భవించిన నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగుల సంఖ్యను పెంచాల్సి ఉండగా తొలగించడం దారుణమన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు చందాలు వేసుకొని పారిశుధ్య పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. రూ.కోట్లతో నిర్మించిన భూగర్భ డ్రెయినేజీ సక్రమంగా పనిచేయక పట్టణ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. యూనియన్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు షేక్ చిన్న అల్లాబక్షు మాట్లాడుతూ తమను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, అప్పటి వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిరసనలో బి.నాగమల్లేశ్వరి, ఎస్.రమాదేవి, షేక్ మహబూబ్ సుభాని, షేక్ మహబూబ్ బాషా, షేక్ సైదా, పి.రమణ, షేక్ షైలు, అక్కి పద్మ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన ఏలూరు జట్టును అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

ముగిసిన యుటిఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు

ఏలూరు, శ్రీకాకుళం క్రికెట్ ఫైనల్స్‌లో విజేతగా ఏలూరు ఉపాధ్యాయుల జట్టు

ప్రజాశక్తి-గుంటూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా గుంటూరులో మూడ్రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు క్రికెట్ సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరిగాయి. గుంటూరు పిచ్చుకల గుంట గ్రౌండ్‌లో ఏలూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో ఏలూరు జట్టు విజేతగా నిలిచింది. విజేతలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ అభినందించారు. క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. తొలుత ఎమ్మెల్సీ లక్ష్మణరావు టాస్ వేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డును తిరుపతి జట్టు నుండి ఎన్.ఏడుకొండలు, బెస్ట్ బౌలర్‌గా ఏలూరుకు చెందిన దిలీప్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ శ్రీకాకుళం జట్టు హర్షకు అందజేశారు. మ్యాచ్ అనంతరం క్రీడల ముగింపు సందర్భంగా బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిత్యం పోరాడే యుటిఎఫ్ తొలిసారిగా జిల్లా,

▶ 2లో

ఎఎన్‌యు న్యాయ సలహాదారులుగా నర్రా శ్రీనివాసరావు నియామకం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయ సలహాదారులుగా హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఏడాది కాలపరిమితితో ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం నర్రా శ్రీనివాసరావు యూనివర్సిటీకి సంబంధించిన కోర్టు కేసుల్లో న్యాయసలహాలు అందిస్తారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

చోరీ కేసుల్లో అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రూ.10 లక్షల బంగారం స్వాధీనం

- 2 లో

దరఖాస్తు ఫారాలతో డాక్టర్ ఫణీంద్రకుమార్, అవగాహన సభ్యులు

అవగాహన ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు గైడెన్స్ సెల్

ప్రజాశక్తి–గుంటూరు

గుంటూరు, కృష్ణా జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు సహకరించేందుకు అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం గైడెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ సెల్‌ను సీనియర్ వైద్యులు డాక్టర్ ఎన్.ఫణీంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెల్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఈ గైడెన్స్ సెల్ నవంబర్ 6వ తేదీ వరకూ పనిచేస్తుందని తెలిపారు. గైడెన్స్ సెల్ నిర్వహణకు విశ్రాంత హెచ్‌ఎం ఆర్.వి.సింగరయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాదరావు, అవగాహన సభ్యులు పి.భావన్నారాయణ, సిహెచ్ ప్రసాద్‌తో కమిటీ ఏర్పాటైంది. కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, ఇంజినీరు సదాశిం తదితరులు పాల్గొన్నారు.

మందులు అందచేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

వెంకటేశ్వరా ఆయుర్వేద హాస్పిటల్లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి–గుంటూరు

స్థానిక మహాత్మాగాంధీ ఇన్నర్ రింగురోడ్డు, గోరంట్లలో శ్రీవెంకటేశ్వరా ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. హాస్పిటల్ ఎండి, చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, 120 మందికి ఉచితంగా నాడీ పరీక్షలు నిర్వహించి, సుమారు రూ.90వేల విలువైన మందులు, కేరళ తైలం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ఎంతో పురాతనమైనదని, అమ్మవంటిదని, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సంపూర్ణంగా మూలంతో సహా వ్యాధులను నయం చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన తమ హాస్పిటల్‌లో అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకూ కేరళ పంచకర్మ వైద్య విధానం ద్వారా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొట్టక్కల్ ఆర్యవైద్యశాల అనుసంబంధంతో నయం చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్ కశ్యప్, డాక్టర్ రాహుల్, డాక్టర్ ప్రణవి, డాక్టర్ ఐశ్వర్య, మేనేజర్ మల్లేశ్వరి, కేరళ పంచకర్మ థెరపిస్టులు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యం, మనోధైర్యంతో క్యాన్సర్‌పై విజయం

ప్రజాశక్తి – గుంటూరు : ఆధునిక వైద్య విధానాలతో పాటు రోగిలో మొక్కవోని మనోధైర్యం నింపటం క్యాన్సర్ పై విజయంలో కీలకంగా నిలుస్తుందని వైద్యులు, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని అవగాహన సంస్థ ఆరోగ్య సభలో సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎన్ ఫణింద్ర కుమార్ తెలిపారు. ఆదివారం అరండల్ పేట లోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'క్యాన్సర్ వ్యాధి– కారణాలు–చికిత్స' అన్న అంశంపై జరిగిన ఆరోగ్య సభకు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ ఆరోగ్య సభలో అమెరికన్ ఆంకాలజీ ఇన్ స్టిట్యూట్ కన్సల్టింగ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎన్. ఫణింద్ర కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలను పొట్టను పెట్టుకుంటున్న వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనదని, భారత్ కి క్యాన్సర్ సునామి పొంచి ఉందంటే అతిశయోక్తి కాదన్నారు. క్యాన్సర్ వచ్చినట్లు తెలియగానే ప్రతి ఒక్కరూ మొదట తీవ్ర మానసిక వేదనకు లోనవుతారని, రోగ నిర్ధారణ, చికిత్స సమయాల్లో శారీరక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారన్నారు. క్యాన్సర్ చికిత్సలో ఆధునిక వైద్య విజ్ఞానం ఎంతగానో పురోగమించినా రోగి అతడి కుటుంబ సభ్యులకు మానసిక స్వాంతన కలిగించి వారిలో మనోధైర్యం నింపి చికిత్స నిర్విఘ్నంగా పూర్తి చేసే విషయంలో మనం వెనుకబడే ఉన్నామని చెప్పాలన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ ఫణీంద్ర కుమార్ ను సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చల్లా అంజిరెడ్డి, రవిచంద్ర, భావన్నారాయణ పాల్గొన్నారు.

దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్

-రిజర్వేషన్ ఫలాలు అనుభవించాకే విజయోత్సవాలు

-జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ సభలో మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి తెనాలి

దేశానికి సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన మహనీయులు బాబు జగజ్జీవన్ రామ్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. తెనాలి పట్టణంలోని చినరావూరులో బాబు జగజ్జీవన్ రామ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మార్కెట్ కూడలి నుంచి సభా వేదిక వరకు ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాలు, బాబు జగజ్జీవన్ రామ్ కమిటీ సభ్యులు భారీ ర్యాలీగా నిర్వహించారు. సభలో మందకష్ణ మాట్లాడుతూ పలు కీలక శాఖలలో వివిధ హోదాలలో పనిచేసిన జగజ్జీవన్ రామ్ ఆ పదవులకే వన్నె తెచ్చారన్నారు. భారత రాజ్యాంగ ముసాయిదా తయారి నుంచి అమలు వరకు ప్రతి ఘట్టంలో జగజ్జీవన్ రామ్ ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. దేశంలో సాంఘిక దురాచారాలున్నంత కాలం రిజర్వేషన్లు అమల్లో ఉండాలని పోరాడిన మహనీయుడని చెప్పారు. అయితే దురదష్టవశాత్తు జగజ్జీవన్ రామ్ చరిత్రను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహావిష్కరణ సభలో పాల్గొనడం తన అదష్టంగా చెప్పారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ విషయానికి వస్తే ఆ ఫలాలు భావితరాలు అనుభవించాలన్నారు. అప్పుడే విజయోత్సవాలకు అనుకూలమైన సమయంగా చెప్పారు. అందుకు తగిన విధంగా ప్రతి బిడ్డను చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఇప్పటికీ వర్గీకరణ పై



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కుట్రలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం లో ఆరుగురు న్యాయమూర్తులు వర్గీకరణను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అయితే ఆ బృందంలో వర్గీకరణను వ్యతిరేకించిన న్యాయమూర్తి సైతం ఇటీవల వర్గీకరణను సమర్థించటం మాదిగల విజయంగా చెప్పారన్నారు వర్గీకరణ తీర్పును ఆ పోరాటంలో అమరులైన వారికి అంకితం చేస్తున్నట్లు మరోసారి ఉద్ఘాటించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ డీజీ కూచిపూడి బాబు రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇందుపల్లి శామ్యూల్ ఆనంద్, స్టేట్ జిఎస్టి ప్రిన్సిపల్ కమిషనర్ పులిపాక ఆనంద్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రిటైర్డ్ డిఐజి చావలి బాలస్వామి, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, బి జె ఆర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రూ.10 లక్షల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి – గుంటూరు జిల్లాప్రతినిధి

ఎస్వీఎన్ కాలనిలో గత నెల 21న జరిగిన చోరీ కేసులో నిందితుడు గొర్రెల చిన్నబాబును ఆదివారం అరెస్టు చేసినట్టు పట్టాభిపురం సిఐ పి.వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. నిందితుని నుండి రూ.10 లక్షల విలువైన 306 గ్రామాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రాజమండ్రికి చెందిన చిన్నబాబు 2015లోనే బీటెక్ మెకానికల్ ఇంజినీరు కోర్సు పూర్తి చేశాడని, వ్యసనాలకు బానిసైన చోరీలకు పాల్పడుతున్నాడని, గతంలో కూడా కొన్ని కేసుల్లో నిందితుడని చెప్పారు. పేకాట, హార్సు రైడింగ్, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి 2019లో నేరాలకు పాల్పడ్డాడని చెప్పారు. రాష్ట్రంలోని 30 పోలీసు స్టేషన్లలో ఇతనిపై కేసులున్నాయన్నారు. పగటి పూట నేరాలు

ఎక్కువ చేస్తాడని, గత నెల 21న గుంటూరులోని ఎస్వీఎన్ కాలనిలో చినబాబు, అతని స్నేహితుడు దువ్వాటి శ్యామ్యూల్ రాజు కలిసి దొంగతనం చేశారన్నారు. శ్యామ్యూల్ రాజు ఇప్పటికే హైదరాబాద్ జైలులో ఉన్నట్లు తెలిపారు.

ముగిసిన యుటిఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర స్థాయిలో క్రీడలు విజయవంతంగా నిర్వహించిందని అభినందించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో క్రీడా నైపుణ్యాలు మెండుగా ఉన్నాయని, వాటికి మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ నాయకులు పరమహంస, క్రీడల కన్వీనర్ లక్ష్మీరాజా, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, ఎఎన్ కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి జి.వి.రమణ, ఎస్.కిశోర్‌కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో బినామీల బాగోతం

(మొదటి పేజీ తరువాయి)

నరసరావుపేటలోని ప్రకాష్ నగర్ లో గల టౌన్ హాల్లో ఆయా జిల్లాల కలెక్టర్ ల ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించనున్నారు. ప్రతి దుకాణానికి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఈ ఫీజు తిరిగి ఇవ్వబోరని అధికార వర్గాలు తెలిపాయి. గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్లతోపాటు మున్సిపాలిటీ, మండలాలలో షాపులు లాటరీ ద్వారా పొందితే ఆయా ఆ షాపులను వాటి పరిధిలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. ఉదాహరణకు ఒక మండలంలో షాపు దక్కితే ఆ షాపు ఆ మండల పరిధిలో ఏ ఊర్లోనైనా, ఏ ప్రాంతంలోనైనా పెట్టుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అదేవిధంగా మున్సిపాలిటీ, నగరపాలక సంస్థ పరిధిలో కూడా లాటరీ ద్వారా గెలుపొందిన షాపులకు ఆయా పరిధిలో మీరు ఎక్కడైనా షాప్ పెట్టుకునే విధంగా ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కార్పొరేషన్ పరిధిలో 5 కిలోమీటర్లు, మున్సిపాలిటీ పరిధిలో 3 కిలోమీటర్లు లోపు కలుపుకొని అక్కడ కూడా కార్పొరేషన్, మున్సిపాలిటీ స్లాబ్ రేట్లు వర్తింపజేసేవారు. ఈసారి ఆ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. దీంతో డిమాండ్ ఉన్న ప్రాంతాలకు దరఖాస్తులు ఎక్కువగాను, డిమాండ్ లేని ప్రాంతాలకు తక్కువ దరఖాస్తులు వస్తున్నట్టు తెలిసింది. అంతేగాక ఈ సారి వ్యాపారులకు మార్జిన్ 20 శాతం వరకు ఇస్తుండటం వల్ల కూడా పోటీ పెరగనుంది.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ప్రజాశక్తి – గుంటూరు

పట్టణంలో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలని, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం హర్షణీయమని గుంటూరు తూర్పు శాసనసభ్యులు నజీర్ అహ్మద్ తెలిపారు.ఆదివారం పాతగుంటూరు యాదవ హైస్కూల్ ప్రాంగణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మరియు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని నజీర్ అహ్మద్ ప్రారంభించారు. పాత గుంటూరు పరిసర ప్రాంతాలలో మానవత చేపడుతున్న పలు కార్యక్రమాలు అభినందనీయమని వారు కొనియాడారు. ఇటీవల ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన బాధితురాలికి కృత్రిమ కాలు అమర్చడంలో మానవత కృషి ప్రశంసనీయమన్నారు. తాను కూడా ఎనిమిది మందికి కృత్రిమ కాళ్ల ఏర్పాటు చేయడంలో సహకారం అందించినట్టు తెలిపారు. మానవత మెడికల్ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజల ఆరోగ్యం కీలకమని, మెరుగైన ఆరోగ్యాన్ని అందించే దిశగా మానవత పలు వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని, దాతల ఆర్థిక సాయంతో మరియు సభ్యుల సమయ దానంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మానవత చైర్మన్ పావులూరు రమేష్ మాట్లాడుతూ పాత గుంటూరు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మానవతలో సభ్యులుగా చేరి సంస్థ చేపడుతున్న పలు కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. మానవత చేపడుతున్న పలు కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ,

రోగులకు మందులను అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

మానవతలో సభ్యునిగా చేరిన నజీర్ అహ్మద్‌కి అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ హైదర్, డాక్టర్ దీప్తి, డాక్టర్ రవీంద్ర గోపి, డాక్టర్ నీరేన్ ఈ వైద్య శిబిరంలో పాల్గొని సేవలు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అశోక్, మీరావలి, మానవత సభ్యులు తిరుపతి రెడ్డి, శ్రీనివాస రెడ్డి, మణికుమార్, గురవారెడ్డి, ఉప్పల సాంబశివరావు, చావా శివాజీ, మేకల రామారావు, ఆనంద్, కె సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకుంటే వెయ్యి టన్నుల ఇసుక

- పల్నాడు జిల్లాలో ఇసుక కొరత లేదు
- 16 నుండి 6 రీచ్‌లలో తవ్వకాలు
- అక్రమ రవాణాపై కఠిన చర్యలు
- పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో ఇసుక కొరత లేదని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నవారికి రోజుకు 1000 మెట్రిక్ టన్నుల సరఫరా చేస్తున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు చెప్పారు. ఇసుక నిర్వహణ కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్ ద్వారా ప్రజలు నేరుగా లేదా సంబంధిత సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉచితంగా ఇసుక పొందవచ్చని అన్నారు. ఇసుక కొరతపై పుకార్లు నమ్మవద్దని, ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాలతో స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఈ నెల 16 నుండి జిల్లాలో 6 ఇసుక రీచులలో 4,23,300 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు సిద్ధంగా ఉండనుందన్నారు. రానున్న రోజుల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి, స్టాక్ పాయింట్ల వరకూ ఇసుక తరలించేందుకు టెండర్లు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20 నాటికి 6 రీచ్‌లలో ఇసుక పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు వస్తే మరో 5 డీసిల్టేషన్ పాయింట్లలోని 5,29,050 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకానికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆన్‌లైన్ లేదా సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఇసుకను పూర్తి ఉచితంగా అందిస్తున్నామని, స్టాక్ పాయింట్ల నిర్వహణ ఖర్చు, ట్యాక్సులు, రవాణా ఖర్చు మాత్రం ప్రజలు చెల్లించాల్సి వుంటుందని చెప్పారు. ప్రస్తుతం అచ్చంపేట మండలం మాదిపాడు స్టాక్ పాయింట్ నుంచి సరఫరా చేస్తున్న ఇసుకపై వినియోగదారుడు నిర్వహణ ఖర్చులు, ఇతర పన్నులు కలిపి టన్నుకు రూ.183 మాత్రమే చెల్లించాల్సివస్తోందని, రవాణా ఖర్చులు సైతం రాష్ట్ర వ్యాప్తంగా సైతం ప్రభుత్వం ఏకీకృతం చేసిందని తెలిపారు.

ఇసుక విషయంలో అక్రమాలు అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బుకింగ్ చేసుకున్న వ్యక్తి రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొన్న అంశానికే ఇసుక వినియోగిస్తున్నాడా లేదా అనేది సంబంధిత సచివాలయ సిబ్బంది ద్వారా ధ్రువీకరణ చేయిస్తామన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ నుంచి 1800 425 6029 టోల్ ఫ్రీ నంబరు ద్వారా ఇసుక అక్రమాలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని, జిల్లా స్థాయి ఇసుక కమిటీ, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్సుల ద్వారా అక్రమాలను అడ్డుకుంటామని చెప్పారు. ఇసుకను అక్రమంగా నిల్వచేసి అధిక ధరలకు అమ్ముకునేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి నాగయ్య, దాచేపల్లి మైన్స్ ఏడీ ప్రకాశ్ కుమార్ పాల్గొన్నారు.

జనవరి నుండి గుంటూరు ఛానల్ విస్తరణ పనులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఈ ప్రాంత ప్రజల కలైన కాల్వల్లో పూడిక తీత, గుంటూరు ఛానల్ అభివృద్ధికి తాను బాధ్యత తీసుకుంటానని, జనవరి పూడికలు తీయిస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఛానల్‌లో గుర్రపు డెక్క రాకుండా శాశ్వత పరిష్కారంపై పరిశీలిస్తున్నట్లు చెప్పారు. టిడిపి వట్టిచెరుకూరు మండల ఆత్మీయ సమావేశం వట్టిచెరుకూరులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధి హామీ గుంటూరు పార్లమెంట్‌లోని ఒక్కో గ్రామానికి రూ.60 లక్షలు మంజూరు చేయించామని, నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేయిస్తామని చెప్పారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని ప్రతి నియోజకవర్గంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. తన సొంత నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన స్కూళ్లను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో టిడిపి శ్రేణులపై పెట్టిన అక్రమ కేసులు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో, కార్యకర్తలకు ధైర్యంగా నిలవడంలో ఎమ్మెల్యే

మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

బి.రామాంజనేయులుతో కలిసి పనిచేస్తామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు యు.సీతారామయ్య, వందనాదేవి, ఎం.పూర్ణచంద్రరావు, సర్పంచ్ ఎ.విజయ్, శివయ్య, నాగారాజు, భావన్నారాయణ, వంశీ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - దాచేపల్లి : తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్మికులు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాచేపల్లి మునిసిపాలిటీలో గత ఐదు సంవత్సరాలుగా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించటం దారుణమన్నారు. తొలగించిన కార్మికులకు తమ సంఘం మద్దతు తెలుపుతుందన్నారు. వారికి తదుపరి పోరాటాల్లో తమ సంఘం పాల్గొంటుందని తెలిపారు.

జిజిహెచ్‌లో సుందరీకరణ పనులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రోగుల సహాయకులను పరిమితంగా అనుమతిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద సుందరికరణ పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ఉమా శంకర్‌తో కలసి డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి లోపలకు గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండటం వల్ల వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారని, ఇటీవల వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొన్న సంగతిని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆసుపత్రికి కేవలం రోగులు, వారి సహాయకులు మాత్రమే రావాలని సూచించారు. ఆస్పత్రిలో దుర్గంధ పూరితమైన వాతవరణం లేకుండా సుందరీకరణ ఉండే విధంగా చేస్తున్నామన్నారు.

గుంటూరుకు గంటలో చేరేలా రహదారి విస్తరణ

ఆర్టీసీ కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్టీసీ, రహదారుల అభివృద్ధి, ఇతర మౌలికవసతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన నాలుగు బస్సులను మజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి జీవీ ఆంజనేయులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ నుంచి గుంటూరు గంటలోనే చేరుకునే నాలుగువరసల రహదారి నిర్మాణాన్ని ప్రారంభించుకోబోతున్నామన్నారు. వినుకొండ నుంచి గుంటూరు వరకు 90 కిలో మీటర్ల హైవేను 4 వరసలుగా విస్తరించబోతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వందరోజుల్లో దాదాపు ప్రతి వారం నూతన బస్సులు ప్రారంభించామన్నారు. వినుకొండ డిపో నుంచే 25 కొత్త బస్సులను ప్రారంభించామని, అద్దె బస్సులు పెట్టే వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మాచర్ల నుంచి చెన్నైకు బస్ సర్వీసు ఏర్పాటు చేశామని, వినుకొండ, మాచర్ల నుంచి మంగళగిరి ఎయిమ్స్‌కు రెండు బస్సులు నడుపుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం అదనంగా బస్ సర్వీసులతో ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. భవిష్యత్తులో రూ.కోటిన్నర నుంచి రూ.2 కోట్లతో వినుకొండ డిపోను ఆధునీకరిస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ సిబ్బంది క్వార్టర్స్ పైనా అధికారులతో చర్చిస్తామని, అవసరమైతే పడగొట్టి కొత్తవి కట్టిస్తామన్నారు. త్వరలోనే వినుకొండ -గుంటూరు మధ్య 4 వరసల రహదారిలానే వినుకొండ నుంచి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిని చేరుకునే రహదారిని 2 వరసలుగా విస్తరించే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. త్వరలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించబోతున్నామని తెలిపారు. వినుకొండలో షాదీఖానాకు రూ.3 కోట్లు, రామలింగేశ్వరస్వామి గుడికి రూ.2 కోట్లు, ఘాట్‌రోడ్ నిర్మాణానికి, టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.పూర్ణచంద్రరావు, పి.నాగేశ్వరరావు, బి.గోవిందరాజులు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని ఐనవోలులో అక్రమంగా నిల్వ ఉంచిన 50 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి వద్ద బియ్యం బస్తాలు తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ వలపర్ల హరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యంను అక్రమంగా తరలిస్తున్న అబ్బరాజుపాలేనికి చెందిన పులివెలుగు రాజును విచారణ చేస్తున్నారు.

ఆటో ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఆటో ఢీకొని ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గోళ్లపాడు సమీపంలోని కస్తూరిభా గాంధీ పాఠశాల వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. రాజు పాలెం మండలం గణపవరానికి చెందిన కొదమల విద్యాసాగర్ (31) నర్సారావుపేటలోని లలితా జ్యూయలరీలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. ప్రతిరోజూ రాత్రి విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై నర్సారావుపేట నుండి సతైనపల్లి వచ్చి గణపవరం వెళుతుంటాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం మీద నర్సారావుపేట నుండి వస్తుండగా గోళ్లపాడు కస్తూరిభా గాంధీ పాఠశాల వద్దకు రాగానే సతైనపల్లి నుండి నర్సారావుపేట వెళుతున్న ఆటో ఢీకొన డంతో విద్యాసాగర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచె ందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సారావుపేట ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేవామని ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపారు. మృతుని తండ్రి గతంలోనే చనిపోగా తల్లి ఇద్దరు సోదరులు, ఒకరి సోదరి ఉన్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

గుర్తు తెలియని మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మాచర్ల మండలం కంభంపాడు సమీపంలోని పెద్ద కాలువ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మాచర్ల రూరల్ ఎస్సై నారాయణ కథనం ప్రకారం.. పెద్దకాల్వ వద్ద అపస్మారక స్థితిలో మహిళ పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆమె వద్దకు వెళ్లి పరిశీలించగా ఆమె పక్కన పురుగుమందు డబ్బా ఉండి వాసనా కూడా వస్తుండడంతో 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఆస్పత్రికి చేరుకునే టప్పటికి మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి సుమారు 35-40 ఏళ్లు ఉంటాయని, ఒంటిపై పసుపు రంగు జాకెట్, ఆరంజ్ కలర్ చీర ధరించారని, ఆచూకీ తెలిసినవారు 9440796241 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పాతకక్షల నేపథ్యంలో దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై బ్లేడుతో దాడిచేసిన ఘటన మండలంలోని వంగిపురంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేంద్ర వివరాల ప్రకారం... వంగిపురానికి చెందిన ఆరుమళ్ల మోహన్ శనివారం రాత్రి 11.30 గంటలప్పుడు తన భార్యకు గ్యాస్ టాబ్లెట్స్ తీసుకురావడానికి గ్రామంలోని దుకాణానికి వెళు తున్నాడు. మర్రిచెట్టు సెంటర్ వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన కొండేపాటి ఏసుబాబు, కారుమూరి బాలస్వామి నిలువరించి గొడవ పెట్టుకున్నారు. మోహన్‌ను బాలస్వామి వెనకనుండి పట్టుకోగా ఏసుబాబు బ్లేడుతో గొంతుపై కోయబోయాడు. మోహన్ తప్పించుకునే ప్రయత్నం చేసినా గొంతు కింద భాగంలో తెగడంతో 108 ద్వారా స్థానికులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.నాగేంద్ర తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - కొల్లిపర : మండలంలోని మున్నంగి పొలాల్లో పేకాట ఆతున్న 9 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుండి రూ.15,150 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. జూదం, గంజాయి, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ఇసుకను అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉప్పలపాడులో పిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వెల్దుర్తి మండలంలోని ఉప్పలపాడులో రూ.1.76 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.శివారెడ్డి, కె.రామాంజనేయరెడ్డి, ఎన్.గురువారెడ్డి, జి.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అసైన్మెంట్ కమిటీలను పునరుద్ధరించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

2014 సంవత్సరానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో భూసేకరణ, భూ పంపిణీ కార్యక్రమాల సక్రమ నిర్వహణకు ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే అధ్యక్షతన ఎస్సైన్మెంట్ కమిటీ ఉండేదని, ఆ కమిటీలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుండి ఒక్కొక్కరు, స్థానిక రెవెన్యూ అధికారి సభ్యులుగా ఉండేవారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ గుర్తు చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎస్సైన్మెంట్ కమిటీ పర్యవేక్షణలో భూ సేకరణ, పంపిణీ కార్యక్రమాలు పారదర్శకంగా జరిగేవని, అయితే గత వైసిపి పాలనలో వీటి ఊసే లేకుండా పోయిందని విమర్శించారు. భూసేకరణ, భూ పంపిణీ విషయంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలొచ్చాయని, ముఖ్యంగా జగనన్న కాలనీ విషయంలో పెద్దఎత్తున అధికార దుర్వినియోగం, అవినీతికి ఆరోపణలున్నాయని అన్నారు. భూసేకరణ, భూ పంపిణీ నిరంతర ప్రక్రియ అయిన నేపథ్యంలో అవినీతికి ఆస్కారం లేని విధంగా అసైన్మెంట్ కమిటీలను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ పత్తి పొలాన్ని పరిశీలిస్తు విదేశీబృందం

పెదకూరపాడు పొలాల్లో విదేశీయులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను విదేశియుల బృందం ఆదివారం సందర్శించింది. రైతులు సర్వేపల్లి అమూల్య, నందిగం జోష్ణ, నార్ల శంకర్రావు పొలాలను అమెరికా, స్పెయిన్‌కు చెందిన క్రేగ్ కాట్, కీట్ అగోడ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు టి.విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ పత్తి పొలాల్లో అంతర పంటలుగా కంది, జొన్న, సజ్జ, గోంగూర, పెసర, దోస, మినుములు వేయడం ద్వారా రైతులకు ప్రతినెలా అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. పత్తి పైరుకు సైతం చీడపీడల ఉధృతి తగ్గుతుందని, భూసారం పెరుగుతుందని చెప్పారు.అంతర పంటలు అయిపోయిన వెంటనే మళ్లీ ఇతర పంటలు సాగుచేసుకోవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్ట మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ ఇటీవల వర్షాల వల్ల దెబ్బతిన్న పొలాలను, ప్రకృతి వ్యవసాయ పొలాలను విదేశీ బృందానికి చూపించారు. రెండు పొలాల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. కె.మధుబాబు, బ్యూలా, ఉదయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అరగంటలో

- సామాన్యులకు అర్థమవ్వని ఉచిత ఇసుక విధానం
- దళారులు, వ్యాపారుల వద్దే అధిక ధరలకు కొనుగోలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చేతిలో గుప్పెడు ఇసుకను తీసుకుని లెక్కపెట్టడం ఎంత కష్టమో ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానంలో ఇసుకను దక్కించుకోవడమే అంతే కష్టంగా మారింది. నిర్మాణ రంగంలో కీలకమైన ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు పనులు కోల్పోవడం ఒకెత్తయితే సామాన్యులు చిన్న ఇల్లు కట్టుకోవాలనా, ఇంటికి మరమ్మతులు చేయించుకోవాలన్నా నానా తంటాలు పడాల్సి వస్తోంది.

ఇసుకను ఆన్‌లైన్‌లో అమ్ముతున్నామని ప్రభుత్వం ప్రకటించినా అర్ధరాత్రుళ్లలో సైట్ ఓపెన్ కావడం, అదీనూ అరగంట, ముప్పావుగంటలోనే అయిపోతుండడంతో సామాన్యులకు ఇసుక కష్టసాధ్యమైంది. నెట్ పరిజ్ఞానం లేని వారు సైట్ జోలికే వెళ్లలేకపోతున్నారు. ఇసుక వ్యాపారం చేసేవారే ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుని పల్నాడు జిల్లాలో ఇసుక రీచ్‌లు ఉన్నచోట నుండి పట్టణానికి ఇసుకను తెచ్చుకుంటున్నారు. దాన్ని పట్టణంలోని పెదనందిపాడు రోడ్డు, పురుషోత్తపట్నం, ఎఎంజి సమీపంలో కుప్పలుగా పోసి ట్రాక్టర్ ఇసుక రూ.8 వేల వరకూ అమ్ముతున్నారు. ఇంత ధర ఏమిటని ఎవరైనా ప్రశ్నిస్తే తమకు రూ.6 వేలకుపైగానే అవుతోందని అంటున్నారు. గతంలో వాగులో నుండి రూ.వెయ్యిలోపు ఇసుక తెచ్చుకున్న స్థానికులు ఇప్పుడు వేలకువేలు పెట్టి కొనలేక పనులను వాయిదా వేసుకుంటున్నారు. తక్షణం చిన్నపాటి పనులు చేయించుకోవాల్సిన వారు బస్తా సిమెంట్ బస్తాల్లో బస్తా రూ.150 చొప్పున కొంటున్నారు. గతంలో ఇది రూ.60కుపైగా మాత్రమే ఉండేది. మొత్తంగా సామాన్యులకు కిలో ఇసుక రూ.3.60 వరకూ పడుతోంది.

మరోవైపు సిమెంట్, ఇనుము, ఇటుక ధరలూ ఎక్కువగానే ఉండడంతో నిర్మాణాలు మందగించాయి. దసరా, సంక్రాంతి నేపథ్యంలో రానున్న ఇంటి ఖర్చులను తలచుకుని కూలీలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే సరిగా పనుల్లేవు. ఈ పరిస్థితులు గాడిన పడే సూచనలూ కనిపించడం లేదు. దీంతో రోజువారీ ఇంటి ఖర్చులకే కానాకష్టంగా ఉంటే ఇక పండగ ఖర్చులకు ఎలాగా? అని సతమంతం అవుతున్నారు.

యడ్లపాడులో తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - యడ్లపాడు

సిపిఎం యడ్లపాడు శాఖ సమావేశం స్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. సభకు జె.శంకరరావు అధ్యక్షత వహించగా పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, సత్వరం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, జాతీయ రహదారికి ఉత్తరం వైపున డ్రెయినేజీ సదుపాయం ఏర్పాటు చేయాలని, ఎస్సీ కాలనీ వాసులకు శ్మశానస్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా శాఖ నూతన కార్యదర్శి బందెల పీటర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు ముత్తవరపు సాంబశివరావు ఆవిష్కరించగా ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పోపూరి సుబ్బారావు పూలమాలలేసి నివాళులర్పించారు. నాయకులు కె.రోశయ్య, ఎం.రామారావు, ఎన్.కాళిదాసు పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-ఈపూరు

ఇసుకను అందుబాటులోకి తేవడం ద్వారా నిర్మాణం రంగ పురోభివృద్ధికి, కార్మికుల ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఈపూరులో సిపిఎం మండల మహాసభ ఆర్.గోవిందు నాయక్ ఆధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. గోపాలరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో ధరలు పెరిగి ప్రజల జీవనం అస్తవ్యస్తమైందని, మరోవైపు మతం పేరుతో విద్వేషాలు రగిలిస్తోందని విమర్శించారు. అనంతరం పలు సమస్యలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఉచిత ఇసుకను

అమలు చేయాలని, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని అందించాలని, విద్యుత్ ఛార్జీలను నియంత్రించాలని మహాసభ డిమాండ్ చేసింది. అనంతరం సిపిఎం మండల కార్యదర్శిగా మేడికొండ దేవసహాయాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంతరెడ్డి, నాయకులు ఎం.మరియమ్మ పాల్గొన్నారు.

ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు ఒప్పిచర్ల విద్యార్థిని

ప్రజాశక్తి - కారంపూడి

స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత శనివారం బాపట్ల జిల్లా జె.పంగులూరులోని మాగుంట సుబ్బారామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి ఖోఖో బాలకల జట్టు ఎంపికలు చేపట్టారు. సబ్ జూనియర్ విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి కారంపూడి మండలం ఒప్పిచర్ల జెడ్పి పాఠశాల విద్యార్థిని షేక్ మహీ మున్నిసా (9వ తరగతి) రాష్టజట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.విజయలలిత తెలిపారు. సోమవారం నుండి నెల్లూరు జిల్లాలో శిక్షణకు హాజరుకానున్న మహీమున్నిసా ఈనెల 16, 17, 18 తేదీల్లో తమిళనాడులోని కోయంభత్తూరులో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారని పిఇటి చిన్నరత్తయ్య చెప్పారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న మహీ మున్నిసాకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను వడ్లమూడి పిచ్చమ్మ జ్ఞాపకార్థం ఆమె మనవడు చక్రపాణి అందించారు. మహీమున్నిసాను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కొండవీడుకోట సందర్శనకు కడప విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఏపీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా నుండి 10వ తరగతి చదువుతున్న 500 మంది విద్యార్థినీ విద్యార్థులు, 100 మంది ఉపాధ్యాయులతో ఈ నెల 4న కడపలో బయలుదేరి శ్రీకాళహస్తి, శ్రీహరికోట, పులికాట్ సరస్సులలో పర్యటించి ఆదివారం చిలకలూరిపేట వచ్చారు. వీరికి పల్నాడు విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖ అధికారుల సహకారంతో వసతి అల్పాహారం ఏర్పాటు చేశామని పల్నాడు విద్యాశాఖ అధికారి ఎం..వెంకటేశ్వర్లు తెలిపారు. వీరు కొండవీడు కోట పర్యటన ముగించుకుని అమరావతి వెళ్లారు.

ఉపాధిహామీ నిధులతో గ్రామాలకు కొత్త దశ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉపాధి హామీ నిధులతో గ్రామాల దశ మారబోతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండల పరిధిలోని కొత్తరాజాపేట, పాతరాజాపేట గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా పంచాయతీలకు నిధులు, రూ.వేలకోట్ల ఉపాధిహామీ పనులకు ఆమోదం లభించిందని, ఉపాధిహామీ నిధులతో 2 గ్రామాల్లోను సీసీ రహదారులు, మురుగుకాల్వలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ ద్వారా మొత్తం 46 రకాలు పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ : బ్రాహ్మణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు జి.వి. మాధవరావు ఆధ్వర్యంలో ప్రతినెలా ఆర్థిక సాయంలో భాగంగా ఆదివారం ఏడు పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలను అందించారు. వీటిని సిహెచ్.రాఘవేంద్రరావు, యస్.యస్.మల్లిఖార్జునశాస్త్రి, జి.నరసింహారావు, కె.శివరామారావు, డి.వెంకటేశ్వర్లు, ఎన్.పవన్ కుమార్, గాయత్రి, సుబ్రహ్మణ్యం సమకూర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ పివి. సురేష్ బాబును సత్కరించారు. బి.సుబ్రహ్మణ్యం, ఎ.నాగేశ్వరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.సుబ్బారావు, భద్రయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలని తీర్మానాలు

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఇసుకను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-గుంటూరు

భవన నిర్మాణ కార్మికులకు, నిర్మాణదారులకు ఇసుకను అందుబాటులోకి తేవాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూనగర్ సిపియం శాఖ మహాసభ ఆదివారం పరమాయకుంటలో కె.వాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుక అందుబాటులో ఉంచకపోవటంతో కార్మికులకు పని లేకుండా పోయిందని, మేము అధికారంలోకి వస్తే ఇసుక అందుబాటులో తెస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిందన్నారు. నూతన ప్రభుత్వం ఇసుక పాలసీ ప్రకటించినా ఎక్కడా అమలు కావట్లేదన్నారు. గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక ఐదారు వేల రూపాయలుంటే, ప్రస్తుతం రూ.9వేలు పెట్టినా దొరకని పరిస్థితి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా టి.రాధాను శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత పార్టీ జెండాను కె.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు ఎస్.కె ఖాసిం షహీద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

చేనేతలందరికీ 'నేతన్న నేస్తం' వర్తింపచేయాలి

ప్రజాశక్తి మంగళగిరి

ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ అన్నారు. మంగళగిరి సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆంజనేయ కాలనీ, కుప్పు రావు కాలనీల సిపిఎం శాఖా మహాసభ జరిగింది. ఈ మహాసభకు సిపిఎం సీనియర్ నాయకులు డి రామారావు అధ్యక్షత వహించారు. మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలని, చేనేత మగ్గాల గుంటల్లోకి నీళ్లు వచ్చిన వరద బాధితులకు ఇంకా కొంతమందికి ఆర్థిక సహాయం అందలేదని వారికి వెంటనే ఆర్థిక సహాయం చేయాలని తీర్మానించడం జరిగింది. 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని, నేతన్న నేస్తం పథకం అందరికీ వర్తింపజేయాలని తీర్మానించడం జరిగింది. శాఖ నూతన కార్యదర్శిగా కూరపాటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మహాసభలో సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, నాయకులు ఎస్ నరసింహారావు, టి హేమ సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సాతులూరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

పొనుగుపాడు గ్రామము నుండి గుంటూరు హైవే రోడ్డుకు వెళ్లే రోడ్డు పునర్ నిర్మించాలని, మేరికపూడి డొంక రోడ్డును, పొనుగుపాడు నుండి దొండపాడు వెళ్ళు రోడ్డును, పొనుగుపాడు నుండి సాతులూరు డొంక మార్గంలోని వాగు పై బ్రిడ్జి నిర్మించి, రోడ్డును వేయాలని ఆదివారం ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో నిర్వహించిన పొనుగుపాడు శాఖ మహాసభ తీర్మానాలు చేసింది. శాఖ మహాసభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు బైరగాని శ్రీనివాస రావు ప్రసంగించారు. అనంతరం శాఖా కార్యదర్శిగా గుంటుపల్లి వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. ముందుగా జెండా ఆవిష్కరణ, ఇటీవల మరణించిన సిపిఎం నేత సీతారాం ఏచూరి, ఇతరనాయకులకు మహాసభ నివాళులర్పించింది.

సిపిఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని నులకపేటలో ఫారెస్ట్ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజల ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని సిపిఎం నులకపేట మహాసభ తీర్మానించింది. శాఖా మహాసభ ఆదివారం బి యేసయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ పతాకాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గత ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ లను వెంటనే పునరుద్ధరించాలని శాఖ తీర్మానించింది. ఫారెస్ట్ ప్రాంత వాసులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసింది రోడ్లు. మంచినీరు. డ్రైనేజీ తదితర మౌలిక

సౌకర్యాలు కల్పించాలని కోరింది. అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని తీర్మానించారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం నులకపేట మహాసభ తీర్మానించింది మహాసభలో నూతన శాఖ కార్యదర్శిగా ఎ శౌరిభర్తులం ను ఎన్నుకున్నారు. మహాసభలో నాయకులు వేముల దుర్గారావు ప్రసంగించారు.

పేదలందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలమివ్వాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో అర్హులైన పేదలందరికీ, మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం మంజూరు చేసి, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మాణం చేపట్టాలని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం వడ్డేశ్వరం గ్రామ పరిధి, జాతీయ రహదారి వద్ద ఉన్న కేబీ భవన్ లో సిపిఎం వడ్డేశ్వరం గ్రామ మహాసభ సిపిఎం సీనియర్ నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఎం అఖిలభారత కార్యదర్శి కామ్రేడ్ సీతారామ్ ఏచూరి, సిపిఎం గ్రామ పార్టీ లో సభ్యులుగా పనిచేసి, మృతి చెందిన కామ్రేడ్ వడ్డేశ్వరం రోశయ్య, మన్నం రాహేలమ్మ మతికి, సంతాపం తెలియజేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 2007వ సంవత్సరం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటం జరిపి, సర్వేనెంబర్ 40 లో పేదలకు ఇల్లు వేయించారని ఆయన అన్నారు. గత 17 సంవత్సరాలుగా సుమారు 50 కుటుంబాల పేదల నివాసం ఉంటున్నప్పటికీ ఇప్పటికీ ఇళ్ల స్థలం మంజూరు కాలేదని ఆయన అన్నారు. గత వైసిపి ప్రభుత్వం సెంటు చొప్పున సర్వేనెంబర్ 40 లో నివాసం ఉంటున్న వారికి నివాస అర్హత పత్రాలు ఇచ్చారనీ, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మాణం చేపట్టలేదని ఆయన అన్నారు. గత సంవత్సర కాలంగా ఇళ్ల స్థలాలు మంజూరు కాక, సర్వేనెంబర్ 40 లో నివాసం ఉంటున్న పేదలు అద్దెలు కట్టుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్తగా ఏర్పడిన


మాట్లాడుతున్న డి వెంకటరెడ్డి

కూటమి ప్రభుత్వం గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఎన్నికల వాగ్దానంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇల్లు నిర్మాణం చేపడతామని వాగ్దానం చేసిందని అన్నారు. గ్రామంలో అధిక సంఖ్యలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరతతో పనులు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ మహాసభలో గ్రామంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, చెరువు పోరంబోకు స్థలాలలో నివాసం ఉంటున్న పేదల ఇళ్లను రెగ్యులర్ చేసి, ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని, మురుగు సమస్యను పరిష్కరించే దిశగా, డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలని, అధిక ధరలు తగ్గించాలని, పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ మహాసభ తీర్మానం చేసింది. అనంతరం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శిగా గుడిసె శ్రీనివాసరావు, ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, గ్రామ నాయకులు గుడిసె శ్రీనివాసరావు, ఎస్.కె గన్, ఎస్ కే కాసింబి, ఇసుకపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న మంత్రి మనోహర్

సత్యనారాయణ పార్కులో జిమ్‌ను ప్రారంభించిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని చినరావూరు పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. పార్కులో చిన్నారుల ఆట వస్తువులు, జిమ్ ఏర్పాటు అనివార్యం కావడంతో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కొత్తమాసు తులసీదాస్ తనయుడు, నటరాజ్ జ్యుయలర్స్ అధినేత కొత్త మాసు కుమార్ స్వచ్ఛందంగా స్పందించారు. స్వతహాగా రూ 5 లక్షలు వెచ్చించి జమ్ ఏర్పాటు చేశారు. నూతన హంగులతో ఏర్పాటైన జిమ్ ను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ పార్కులో ఇంకా ఏవైనా సమస్యలుంటే తమ దష్టికి తేవాలన్నారు. స్వచ్ఛందంగా స్పందించిన కొత్తమాసు కుమార్ ను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నటరాజ్ జెవెల్లెర్స్ ఏర్పాటుచేసిన బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరిదాసు గౌరీ శంకర్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఆఫర్ లెటర్లు పొందిన అభ్యర్థులతో ఎమ్మెల్యే మాధవి

1200 మందికి ఆఫర్ లెటర్‌లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గళ్ళ మాధవి ఆధ్వర్యంలో స్థానిక పాటిబండ్ల సీతారామయ్య స్కూలులో ఆదివారం మెగా జాబ్ మేళాకు భారీ స్పందన లభించింది. నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ప్రముఖ కంపెనీలైన టెక్ మహేంద్ర, అమర్ రాజా, ఈసిపిఎల్, యాక్సిస్ బ్యాంక్, టాటా, ముత్తూట్ ఫైనాన్స్, రిలయన్స్, ఎంఆర్ఎఫ్ టైర్స్, హీరో, డైకిన్, ఎయిర్టెల్,స్విగ్గీ, ఫోన్ పే వంటి సంస్థల వారు వచ్చినట్టు ఎమ్మెల్యే మాధవి తెలిపారు. మొత్తం ఆరు వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. 1200 మంది ఆదివారం ఆఫర్ లెటర్లు ఇచ్చారన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలి

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం సూపర్ సిక్స్ వెంటనే అమలు చేయాలని, ఇసుకపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నారని కొట్టిపారేసి తప్పుకోవడం సరికాదని ఇసుక సరఫరా సరళతరం చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం పలనాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సొసైటీ ఏరియా శాఖ మహాసభ నాయకులు బిట్ర పానకాలు అధ్యక్షతన నిర్వహించారు. విజయ్ కుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రజలు నిత్యం వాడుకునే నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరలను అదుపు చేయాలని అన్ని రకాల నిత్యవసర వస్తువులు రేషన్ షాపుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ముందుగా సిపిఎం జెండాను పట్టణ కార్యదర్శి ధరణికోట విమల ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, ట్రేడ్ యూనియన్ నాయకులు పర్సా సత్యనారాయణ, సొసైటీ ఏరియా శాఖ పరిధిలోని పులిపాటి వెంకటేశ్వర్లుకు, కట్ట రాజులకు మహాసభ సంతాపం తెలిపింది. శాఖ పరిధిలోని

జెండా ఆవిష్కరణలో పాల్గొన్నా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తదితరులు

ఒకటి, రెండు వార్డులకు సంబంధించిన డ్రైనేజీ అబ్బూరు, అచ్చంపేట రోడ్ల వరకు సిమెంట్ కాలువ కట్టి మురుగును వెళ్ళిపోయేటట్లు చేయాలని, చేనేత పై కేంద్ర ప్రభుత్వం విధించిన జిఎస్టిని తొలగించాలని మహాసభ తీర్మానాలు చేసింది. అనంతరం నూతన కార్యదర్శిగా గంజి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ మహాసభలో జిల్లా కమిటీ సభ్యులు గుంటూరు మల్లేశ్వరి, పట్టణ కమిటీ సభ్యులు గద్దె ఉమాశ్రీ, కట్ట శివ దుర్గ రావు, కట్ట రమాదేవి, బిట్ర రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో ఉచిత క్లాసులు

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు మానవత స్వచ్ఛంద సంస్థ ఇస్తున్న ఉచిత శిక్షణా తరగతుల్లో ఆదివారం జిల్లా యూత్ సర్వీసెస్ మేనేజర్ రాధిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని పరీక్షకు సిద్ధం కావాలన్నారు. కష్టపడితే ఎంత కష్టమైనా సులువుగా విజయం సాధించవచ్చన్నారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ నిపుణులు జి.ప్రకాష్, గణితం నిపుణులు ఎస్.ఆదినారాయణ, స్పీడ్ మ్యాథ్స్ నిపుణులు శ్రీనివాస్ విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మానవతా సెక్రెటరీ కె.సతీష్, డైరెక్టర్లు ఉప్పాల సంవత్సరాలు, ఎన్.సాంబశివరావు, చావా శివాజీ, ట్రెజరర్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

కష్టాల్లో ఉన్న టిడిపి కార్యకర్త కుటుంబానికీ అండగా ఉంటానని నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఇటీవల మృతిచెందిన టిడిపి నాయకులు కుటుంబాలను ఆయన ఆదివారం పరామర్శించారు. పట్టణ టిడిపి సీనియర్ నాయకులు నల్లబోయిన బాలసౌరి, మండలంలోని తాళ్ళపల్లి సర్పంచి పలుపులేటి బ్రహ్మనాయుడు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణంలోని మైనార్టీ నాయకుడు పఠాన్ బాబూఖాన్ ఇంటికి వెళ్ళి పరామర్శించారు. మెరుగైన వైద్య సహాయం అందేలా చూస్తానని కుటుంబ సభ్యులకు ఎంపి భరోసానిచ్చారు. ఎంపి వెంట మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, టిడిపి నాయకులు కొమెరా దుర్గారావు, ధారూ నాయక్ ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఎస్టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌టియు కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 25 వేలమంది అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వీరికి గత రెండు నెలలుగా(ఆగస్ట్, సెప్టెంబర్) ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి జీతాలు జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, సీనియర్ నాయకులు చావలి మల్లేశ్వరరావు, చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్లాన జయప్రకాష్, పట్టణ నాయకులు ఇనకోల్లు అంకమ్మారావు, పి.సాగర్‌బాబు, కె.ఏడుకొండలు, ఎం.చిన వేంకటస్వామి పాల్గొన్నారు.

9 వరకు మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో నూతన మద్యం షాపులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ డి.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. దరఖాస్తులను ఆన్లైన్, ఆఫ్ లైన్ విధానంలో అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటో తేదీ నుండి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, ఈపూరు స్టేషన్ పరిధిలో ఈపూరులో రెండు, రొంపిచర్లలో నాలుగు, బొల్లాపల్లిలో మూడు మద్యం షాపులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు నాన్ రిఫండబుల్ ఫీజు కింద రూ.రెండు లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక వ్యక్తి ఎన్ని మద్యం షాపులకైనా దరఖాస్తు చేయవచ్చని సిఐ తెలిపారు. ఆయనతో పాటు ఎక్సైజ్ ఎస్ఐ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పోలీసులు

నత్తనడకన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేటలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. రహదారులు సక్రమంగా లేని కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుంతలు, ఛిదరించిన పిచ్‌రోడ్ల వల్ల వాహనదారులు అదుపు తప్పుతున్నారు. రాత్రి సమయాల్లో సరైన లైటింగ్ లేకపోవడం వంటి సమస్యలు వాహనదారులను ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఇటీవల రోడ్డు ప్రమాదాల గణాంకాలు రహదారుల పరిస్థితి ఎంతటి ముప్పుగా మారిందో చెబుతున్నాయి. అభివృద్ధికి గుర్తుగా జాతీయ రహదారులని చెప్పుకోవచ్చు కానీ చిలకలూరిపేట బైపాస్ రోడ్డు అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై ప్రజలు పెదవివిరుస్తున్నారు.

స్థానిక మండల పరిధిలో రామచంద్రపురం నుండి యడ్లపాడు నక్కవాగు బ్రిడ్జి వరకు 16 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను బిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (బాలినేని శీనయ్య కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్) కంపెనీ చేపటింది. సుమారు నాలుగు సంవత్సరాలు కిందట ప్రారంభమైన ఈ బైపాస్-రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతోంది. ఈ రోడ్డులో అండర్ పాస్ బ్రిడ్జిలు మొత్తం నాలుగు, ఫ్లై ఓవర్లు మూడుగా ఉన్నాయి.. వాగుపై వంతెనలు(బ్రిడ్జిలు) మూడుతో మొత్తం ఆరు లైన్ల నిర్మాణాన్ని చేపట్టారు.

ఆగిపోయిన బైపాస్‌రోడ్డు నిర్మాణ పనులు

ప్రధానంగా పట్టణంలో ప్రమాదాలను, రద్దీని తగ్గించేందుకు ఈ బైపాస్ రోడ్డు నిర్మాణ పనుకు చేపట్టారు. కానీ అది ఏనాటికి పూర్తవుతుందోనని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా జాతీయ రహదారిపై రామచంద్రపురం, ఆంజనేయస్వామి గుడి వద్ద పట్టణంలోని విజయబ్యాంకు వద్ద, ఏఎంజీ వద్ద తిమ్మాపురం నాలుగు కూడలి జంక్షన్లో రోడ్డుప్రమాదాలు అధికమవుతున్నాయి. ప్రయాణికులు, వాహనఛోధకుల విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

మున్సిపాలిటీలో నిబంధనలకు తిలోదకాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేల మున్సిపాలిటిలో సమస్యలను పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కౌన్సిలర్లు పట్టనట్లు వ్యవహరించడం శోచనీయం. ప్రజల కోసం ఎన్నిక కాబడిన కౌన్సిలర్లు సమావేశాలకు హాజరుకాకపోవడం వల్ల సమస్యలు కొలిక్కిరావడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరించడం శోచనీయం. స్థానిక మున్సిపాలిటిలో నిబంధన లు ఎక్కడ అమలు కావడం లేదు. వార్డు కౌన్సిలర్‌గా ప్రజల బాగోగు, అభివృద్ధిని పట్టించుకోవాల్సిన కౌన్సిలర్లు సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. అలాంటి వారిని అడిగే అధికారే లేకపోతున్నారు. అయినా గౌరవవేతనం వారి బ్యాంకుఖాతాల్లో జమైపోతుండడం శోచనీయం.

కౌన్సిలింగ్ సమావేశాలకు డుమ్మా

2021 ఏప్రిల్ నెలలో జరిగిన మున్సిపాలిటీ కౌన్సిలర్ ఎన్నికల్లో 30 వార్డు వైసిపి కౌన్సిలర్ విడుదల గోపి ప్రత్యర్థి జనసేన పార్టీ అభ్యర్థి తోట రాజారమేష్‌పై సుమారుగా 19/2 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొంది కౌన్సిలర్ అయ్యారు. అప్పటి నుంచి గతనెల సెప్టెంబర్‌తో 43 కౌ న్సిలింగ్ సమావేశాలు జరిగాయి. వాస్తవంగా 43 జరగాల్సి ఉంది. ఎంఎల్‌ఏ. ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులోకి రావడంతో రెండుసమావేశాలు ఆగిపోయాయి. వరుసగా మూ డు కౌన్సిల్ సమావేశాలు జరుపక పోతే కౌన్సిల్ రద్దు అవు తుందనే ఉద్ధేశంతో అప్పటి కలెక్టర్ ద్వారా ఎన్నికల అధికారి సమక్షంలో 42వ కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించారు. ఈ 42 సమా వేశాల్లో ఒకటి అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో సాధారణ, అత్యవసర మున్సిపల్ కౌన్సిలింగ్ సమావేశాలకు 30వ వార్డు కౌన్సిలర్ విడుదల గోపి హాజరుకాకపోయినా ఆయన కౌన్సిలింగ్ సభ్యత్వం రద్దు కాకపోవడం శోచనీయం. దీన్ని ఏఒక్క కౌన్సిలర్ ప్రశ్నించకపోవడం హాస్యాస్పదం. రాజకీయ పార్టీల అండదండలతో ఇలా వ్యవహరించడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇటివల జరిగిన 4, 5 కౌన్సిల్ సమా వేశాలకు మూడోవార్డు కౌన్సిలర్ సాగర్, 1వ వార్డు కౌన్సిలర్ సుధాకర్‌లు గైర్హాజరయ్యారు. అయినా చైర్మన్ పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వెరికోస్ వెయిన్స్ రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- మాచర్ల

స్థానిక రామాటాకీస్ లైన్‌లోని శ్రీకృష్ణ జనరల్ ఆస్పత్రిలో హైదరాబద్‌కు చెందిన ఎవీస్ వైద్యశాల వైద్యులు వెరికోస్ వెయిన్స్(ఉబ్బిన సిరలు) రోగులకు ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ సాయిమాసన 50 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వ్యాధి తీవ్రత ఎక్కువుగా ఉన్నవారు హైదరాబాద్ వైద్యశాలలో చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిమానస మాట్లాడుతూ కాళ్లలో మంట, దురద, కాళ్ళ రంగు మారటం, ఉబ్బటం, పుండ్లు ఏర్పడటం, వంకర్లు పోవటం, బరువెక్కుటం, సిరల వాపు వంటి లక్షణాలు వెరికోస్ వెయిన్స్ వ్యాధి లక్షణాలని, వీటిని అశ్రద్ధ చేయకూడదని, వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - కారంపూడి :మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమన్ని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు. శ్రీకష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి. బ్రహ్మానందరెడ్డి ఆదివారం నిర్వహించారు. నాబార్డ్ నిధులు రూ.2.9 లక్షలతో కారంపూడిలో నూతనంగా నిర్మించిన బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనాన్ని ఎంపి, ఎమ్మెల్యే ప్రారంభించారు. పేటసన్నెగండ్ల గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద రూ.15లక్షల నిధులతో మంజూరైన నూతన సిసిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కారంపూడిలోని ఇందిరానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నరమాలపాడు గ్రామంలో ఉపాధిహామీ నిధులతో సిసిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. నరమాలపాడు గ్రామంలో నందమూరి. తారకరామారావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి నాగిరెడ్డి, పరిటాల రవి విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం అదే గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయం భవనాన్ని ప్రారంభించారు. కారంపూడిలోని ఆర్‌టిసి బస్టాండు ఎదురు సుద్దగుంతల బజారులో నూతన కనకదుర్గమ్మ దేవాలయాన్ని ఎంపి, ఎమ్మెల్యేలు సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు దారునాయక్, నియోజకవర్గ నాయకులు

వై.మల్లికార్జునరావు, కె.శివరెడ్డి, జె.అక్కిరెడ్డి, నియోజకవర్గ జనసేన నాయకులు బి.రామాంజనేయులు, టిడిపి మండలాధ్యక్షులు యు.లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు పి.అంజయ్య, ఎం.సత్యం పాల్గొన్నారు.

8న విజయవాడ ఎంబివికె లో కౌలు రైతుల రాష్ట్ర సదస్సు

దుగ్గిరాలలో

పెదకాకాని మండలంలో

ప్రజాశక్తి - దుగ్గిరాల

నష్టపరిహారం అందని కౌలు రైతులు విజయవాడలో ఈ నెల 8న జరిగే సదస్సుకు తరలిరావాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకర్ కోరారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో తుమ్మపూడి, చిలువూరు గ్రామాలలో రైతులను కలిసి నష్టపరిహారం చెల్లింపులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల తుమ్మపూడి, చిలువూరు ప్రాంతాల్లో పంటలన్నీ జలమయం అయ్యిందన్నారు. కౌలు రైతులు లక్షల్లో పెట్టుబడి పెట్టిన కంద, పసుపు తదితర పంటలు నీటమునిగాయన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నీట మునిగిన పంటల నుండి ఒక గింజగానీ, దుంప గాని చేతికొచ్చే పరిస్థితి లేకపోయిందన్నారు. ప్రభుత్వం అతి తక్కువగా వరికి ఎకరాకు రూ.పదివేలు, వాణిజ్య పంటలకు రూ.14వేలు నష్టపరిహారం ప్రకటించిందని, అదీ ఐదెకరాలకు మించి ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఇస్తామన్న కౌలు ప్రకటనకే పరిమితం అయ్యిందన్నారు. కావున గ్రామాల వారీగా నష్టపరిహారం అందని కౌలు రైతులందరూ అర్జీలు తీసుకొని విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రానికి రావాల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి ప్రకటన ప్రకారం వరికి ఎకరాకు రూ.25 వేలు, కంద, పసుపు మిగిలిన వాణిజ్య, పంటలకు రూ.60వేలు నుండి రూ.లక్ష వరకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వరదలకు గురైన ఇళ్లకు విజయవాడలో ఇచ్చినట్లు కనీసం రూ.25 వేలైనా ఇవ్వాలన్నారు. రాజకీయ వివక్ష లేకుండా అందర్నీ ఆదుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ హామీ ఇచ్చిన రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు సాగుదారుల రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలను ఇవ్వాలన్నారు. పంటల బీమా వాస్తవ కౌలు రైతులకే ఇవ్వాలని కోరారు. ప్రత్యేకమైన పంటలు వేసుకోవడానికి ఉచితంగా విత్తనాలు రైతులకి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, జి.యోహాను, ఎన్.మరీదాసు, కె.వాల్‌టీనురాజు, ఎన్.శ్రీనివాసు, బి.ప్రసాద్,జార్జి, సుబ్బారావు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

వదర కారణంగా నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం అందేలా ఉద్యమిస్తున్న రైతు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీలు పెదకాకాని మండలం వెంకట కృష్ణాపురంలో పర్యటించారు. అక్కడి రైతు సంఘం బృందాలను కలిసి సమవేశాన్ని నిర్వహించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులు తమ బాధను వెల్లగక్కుతూ తాము ఐదు ఎకరాలు నష్టపోతే ఒకేఒక్క ఎకరానికే నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించలేదని వాపోయారు. కొందరికైతే అదీ అందలేదన్నారు. ఈ సందర్భంగా నాయకులు అజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో జరిగిన నష్టం భారీగా పెదకాకాని మండలం వెంకట కృష్ణాపురం గ్రామం ఒకటన్నారు. ఈ నేపథ్యంలో యావత్తు వరద నష్టం తగిన అన్ని ప్రాంతాలు పోల్చుకుంటే నూటికి నూరుపాళ్ళ నష్టపోయిన వాళ్ళకి నష్టపరిహారం చెల్లించామని బూటకపు ప్రచారం, తప్పుడు లెక్కలు చెప్తున్నారన్నారు. పరిహారం అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందడం జరిగిందని, రూ.వేల కోట్లు చందాల రూపంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చినా అవన్నీ వరద నష్టాలకు కేటాయించకుండా, వ్యవసాయ రైతులకూ ఇవ్వకుండా మరి దేనికి ఖర్చు చేసినట్లని అనుమానం వ్యక్తం చేశారు. కావున నష్టపరిహారం కోసం రైతులతో విజయవాడలో నిర్వహించతలపెట్టిన సదస్సులో పాల్గొనా పిలుపునిచ్చారు. నాయకులు శివాజీ మాట్లాడుతూ వెంకట కృష్ణాపురం గ్రామంలో ప్రభుత్వాధికారులు రైతులను మభ్యపెట్టి నష్టపరిహారం ఇస్తామని చెప్పి పత్రికలు, టీవీ ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 8న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పెదనందిపాడు, నాగులపాడు, వరగాని గ్రామాలలో సదస్సు జయప్రదం చేయాలని కరపత్రాల ప్రచారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు, కౌలు రైతు సంఘం నాయకులు చుక్కా యానాదులు మాట్లాడుతూ భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేక పరిహారం అందడం లేదని వివరించారు. కౌలు రైతులు, సాగుదారుల రుణాలను రీ షెడ్యూల్ చేసి, కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకం 20,000 వెంటనే రైతుల, కౌలు రైతుల ఖాతాలలో జమ చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి విజయవాడలో జరిగే కౌలు రైతుల సదస్సుకు, రైతు, కౌలు రైతు సోదరులందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు 'పాలస్తీనా' సంఘీభావ సభ

ప్రజాశక్తి - తాడేపల్లి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గపు దాడులను నిరసిస్తూ సోమవారం తాడేపల్లి ఆలస్తీనా సంఘీభావ సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం, సిపిఐ నాయకులు బూరుగు వెంకటేశ్వర్లు తుడిమెల్ల వెంకటయ్య తెలిపారు ఆదివారం తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గమైన దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మానవత్వం మరిచి అమెరికా అండతో చేస్తున్న దాడులను వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. నివాస ప్రాంతాలపై బాంబులవర్షం కురిపించడం, యుద్ధంలో చిన్నారులను సైతం మట్టుపెట్టడం దారుణమన్నారు. ఈ దురాక్రమణ యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని కోరారు. సిపిఎం పట్టణ నాయకులు దొంతిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వైభరణబాస్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక కొత్తపేట, ఫ్యాన్సీ మర్చంట్స్ కళ్యాణ మండపంలో శ్రీవాసవి సేవా సమితి ఆధ్వర్యంలో 600 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, 50 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున రూ.50 వేలు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి ఉపాధ్యక్షులు కొత్తూరు వెంకట నరసింహారావు, చౌట ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చుండూరు దామోదరరావు, కార్యదర్శి కాకర్ల హనుమంతరావు, ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జె.శేష ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఘనంగా పిఅండ్‌టి ఎంప్లాయీస్ సొసైటీ 61వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా నృత్యం చేస్తున్న దృశ్యం

తెనాలి పిఅండ్‌టి ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ 61వ వార్షిక సర్వసభ్య సమావేశం స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు ముంతల రవికుమార్ అధ్యక్షతన కార్యదర్శి చెరుకూరి భాగ్యరాజ్ వార్షిక నివేదిక సమర్పించారు. 1963లో స్థాపించిన సొసైటీ 61 వసంతాలను పూర్తిచేసుకుందని, ఈ ఏడాది మార్చి 31 నాటికి సభ్యతం 3662కు చేరిందని, వీరిలో కొత్త సభ్యత్వం తీసుకున్నవారి సంఖ్య 392గా చెప్పారు. సొసైటీ ద్వారా నిర్వహించిన సామాజిక, ఆర్థిక పరమైన అంశాలను ఆయన వివరించారు. ఆడిట్ అకౌంట్స్ నివేదిక సమర్పించిన అనంతరం అజెండా అంశాలను ఆమోదించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర్ బాబు మాట్లాడుతూ సొసైటీ నిబంధనలు, సేవా భావాన్ని ప్రశంసించారు. ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా సొసైటీ పనిచేయటం అభినందనీయమన్నారు. బిఎస్ఎన్ఎల్ ఎస్‌డిఈ ఎన్.మదన్‌మోహనరావు, సొసైటీ మాజి కార్యదర్శి ఐ.కోటేశ్వరరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో సభ్యులు వైద్య సేవలందించారు. ప్రజానాట్యమండలి అరుణోదయా వారి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దామర్ల వెంకట అప్పారావు, కోశాధికారి తొలుచూరు పోతురాజు, డైరెక్టర్లు లింగిశెట్టి బాలాజిరావు, ఉమ్మిది వరపుసత్యనారాయణ, ధరావత్తు బాలాజి, తుళ్లూరి రవిప్రసాద్, కొప్పుల విజయకుమార్; మండలనేని శివయ్య, చేవూరి వెంకటాద్రి, వల్లెం వెంకటేశ్వర్లు సభ్యులు పాల్గొన్నారు.

చేనేత విభాగం అధ్యక్షునిగా పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం అధ్యక్షునిగా మంగళగిరికి చెందిన రామనాథం పూర్ణచంద్రరావు నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మంగళగిరి నియోజకవర్గ పురప్రముఖులు అభినందన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన పూర్ణచంద్రరావు నివాసంలో పుష్పగుచ్చాలు

అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామనాథం కోటేశ్వరరావు, రామనాథం బాలకృష్ణ, రామనాథం వీరభద్రరావు, రామనాథం బోసుబాబు, రామనాథం భాస్కర్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు సిఐ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో రౌడీషీటర్లకు సిఐ వినోద్ కుమార్ ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని ఆయన సూచించారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడినా, ప్రేరేపించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా జీవనానికి ఆటంకం కలిగించవద్దని సూచించారు.

పాత పద్ధతిలోనే రేషన్‌షాపు కొనసాగాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

రేషన్ షాపులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువరించడం పట్ల తాడేపల్లిలోని డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో నెంబర్ 10 విడుదల చేసి కొన్ని మార్పులు చేర్పులు చేసి తమకు అనుకూలమైన వ్యక్తులను నియమించాలని కోరుతున్నారు. డీలర్ల సంక్షేమ సంఘం తరఫున హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాదులు కె.శ్రీనివాస్, ఆర్.సాయిప్రకాష్, ఎం.రాంప్రసాద్. ఏపీకి చెందిన అడిషనల్ అడ్వకేట్ జనరల్ సహా ఇరుపక్షాల వాదనలను హైకోర్టు స్వీకరించింది. ఇరువాదాలు విన్న తర్వాత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 10ని కొట్టివేస్తూ తీర్పు విలువరించింది. దీంతో జీవో నెంబర్ 32 విడుదల చేస్తూ పాత పద్ధతిని కొనసాగిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనిపై తాడేపల్లిలోని రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసిపి గ్రామాధ్యక్షులుగా మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం దొండపాడు గ్రామ వైసిపి అధ్యక్షులుగా మైనేని నాగ మల్లేశ్వరరావు నియమించబడ్డారు.ఎంపిక కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు నాయుడు నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు కొప్పుల శేషగిరిరావు,గ్రామ మాజీ అధ్యక్షులు కొమ్మినేని చిన వెంకటేశ్వరరావు(దత్తు) పాల్గొన్నారు. తనను గ్రామ వైసిపి అధ్యక్షునిగా నియమించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

కరకట్ట ముళ్లచెట్లు తొలగింపు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసం ఉంటున్న అమరావతి కరకట్టకుపై గల నివాసం నుండి ప్రకాశం బ్యారేజీ వరకు రోడ్డు ఇరువైపున గల ముళ్ళ చెట్లను తొలగించే పనులు గత రెండు రోజుల నుండి వేగవంతంగా జరుగుతున్నాయి. కరకట్ట రోడ్డు సింగిల్ లైన్ కావడంతో ఇరువైపులా అడవి పెరిగినట్లు ముళ్లకంప పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వాహనదారులకు మార్జిన్ అర్థం కాక తరసు ప్రమాదాలకు గురవుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంది. నడిచి వచ్చేప్రజలకు ఒక్కో సందర్భంలో వాహనాలు మీదకు దూసుకురావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కరకట్ట పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేశారు.

అవయవ దానం ప్రాణ దానంతో సమానం

నేత్ర, అవయవ, శరీర దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

పల్నాడు విజ్ఞాన కేంద్రం సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ ఎస్.చలపతిరావు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గద్దె చలమయ్య

మనిషి మరణానంతరం కట్టెలో కాలి పోయే లేదా, మట్టిలో కలిసిపోయే శరీరాన్ని దానం చేయడం వలన ఎటువంటి నష్టం లేదని నేత్రదానం ఒకరికి చూపును ప్రసాదిస్తుందని, అవయవ దానం ప్రాణదానంతో సమానమని అమ్మా నేత్ర, శరీర, అవయవ దాన ప్రోత్సాహకుల సంఘం పల్నాడు, గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్ ఎస్.చలపతిరావు అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డు లోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నేత్ర శరీర అవయవ దాన సదస్సును విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కట్టా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సదస్సులో చలపతిరావు మాట్లాడుతు మెడికల్ కళాశాలలకు ప్రయోగాల నిమిత్తం అందజేసే శరీర దానం విద్యా దానమని తెలిపారు. నేత్రాలు, అవయవాలు, శరీర దానం పట్ల ప్రజలు అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శరీర, అవయవ దానాల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న విజ్ఞాన అవగాహన సదస్సులో భాగంగా శరీర అవయవ దాన పై సదస్సు నిర్వహించామన్నారు. ప్రజల్లో అభ్యుదయ భావాలు రేకెత్తించడం సమాజ శ్రేయస్సు ఉపయోగపడే ఆయా అంశాల పట్ల అవగాహన కల్పించడం కోసం పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ముందుంటుందన్నారు. నేత్ర, అవయవ, శరీర దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని దీనిపై ముందుగా ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయించుకోకపోయినా మరణానంతరం ట్రస్టు సభ్యులకు సమాచారం అందజేస్తే సరిపోతుందన్నారు. అనంతరం దీనికి సంబంధించి కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా రామబ్రహ్మం, ట్రస్ట్ సభ్యులు కామినేని రామారావు, అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, అంకారావు, చలపతిరావు, మహమ్మద్ రఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కమిటీ సభ్యులు డి శివ కుమారి,ఏ. భాగేశ్వరి దేవి, ఎస్ ఆంజనేయరాజు, సుభాష్ చంద్రబోస్, ఎస్ వెంకటేశ్వరరాజు, బి సలీం, ఎం. ఆంజనేయులు, కోండ్రు ఆంజనేయులు, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులే విజ్ఞాన్స్ లారాకు బ్రాండ్ అంబాసిడర్లు

ఫ్రెషర్స్‌డే వేడుకల్లో విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులే విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్స్‌ని విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందంజలో ఉండాలన్నారు. విద్యార్థులందరూ జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆనందించాలన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌కు, యోగాకు ఎక్కువగా సమయాన్ని కేటాయించాలని, విద్య, ఉద్యోగం, ఆట, పాట..ఎందులో టాపర్‌గా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే వీటిని ప్రణాళికతో అమలు చేస్తే భవిష్యత్‌లో కోరుకున్న విభాగంలో రాణించడం సులువు అవుతుందన్నారు. విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ భవిష్యత్తు ప్రయత్నాలకు సంబంధించి మిమ్మల్ని మీరు సిద్ధంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేర్చుకునే క్రమంలో ఉండటానికి ప్రయత్నించాలని, ఎప్పటికప్పుడు మీరు మిమ్మల్ని అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలని తెలియజేశారు. విద్యార్థులకు నైపుణ్యంతో పాటు పరిశోధనాత్మక ఆలోచనలు కలిగిన విద్యా విధానం ఉండాలని తెలిపారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆటపాటలు, సంగీత వాయిద్యాలతో కళాశాల ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెనుకబడిన తరగతులకు నాణ్యమైన విద్యాబోధన

వెనుకబడిన తరగతుల విధ్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తాయని పల్నాడు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి లోతేటి వరలక్ష్మీ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సమర్థవంతంగా విద్యార్థులకు అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2022-2023 విద్యా సంవత్స రంలో 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధి ంచి పల్నాడు జిల్లా మొదటి స్థానంలో నిలిపామని ఆమె అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు తెలిపారు.

లోతేటి వరలక్ష్మీ
పల్నాడు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి

పల్నాడు జిల్లాలో గిరిజన సంక్షేమ వసతి గృహాలు ఎన్ని ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో 11 ఏపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, 12 గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలు ఉన్నాయి.

వసతి గృహాలు పిల్లలు లేక మూసేసే పరిస్థితి ఏర్పడింది.. ఎందుకని?

పల్నాడు జిల్లా ఏర్పడ్డాక ఎక్కడా కూడా అటువంటి పరిస్థితి లేదు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా రెసిడెన్షియల్, గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఇనిస్టిట్యూషన్స్‌లలో 3594 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. అత్యధికంగా మాచర్ల మండలం ఎత్తిపోతల ఆశ్రమ విద్యార్థినిల పాఠశాలలో 515 మంది విద్యానభ్యసిస్తున్నారు.

విద్యార్థులు వసతి గృహాలలో ఉండటానికి ఆసక్తి చూపటం లేదనే వాదనలు ఉన్నాయి?

అటువందేమీ లేదు. జిల్లాలో ఆయా ప్రాంతాలలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలలకు నివాసాలు దగ్గరగా ఉన్న నేపథ్యంలో ఇళ్ల వద్ద నుండి వచ్చేందుకు మక్కువ చూపుతున్న నేపథ్యం ఉంది.

వసతి గృహాలలో మౌలిక వసతుల అభివృద్ధికి ఏ చర్యలు చేపడుతున్నారు?

వారంలో 3 నుండి 4 రోజులు జిల్లాలో పర్యటించి దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. వారంలో 2 రోజులు చికెన్ ఇస్తున్నాం. మెనూ సక్రమంగా అమలు అవుతుంది. శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొన్ని గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు కింద నిర్మించడం జరిగింది. వసతి గృహాలలో పరిసరాల శుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం.

కాస్మొటిక్ ఛార్జీలు సకాలంలో ఇవ్వడం లేదు? ఎంతెంత ఇస్తున్నారు?

కాస్త ఆలస్యం అయినా 2 లేదా 3 నెలల నగదు ఒక్కసారే జమ అవుతున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. కాస్మొటిక్ చార్జీలు తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాకు జమ చేయడం జరుగుతుంది. 3 నుండి 7 తరగతులు విద్యార్థులకు రూ 200, 8, 9,10 తరగతుల విద్యార్థులకు రూ .250అందజేస్తున్నాం.

10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ఏమి చర్యలు చేపడుతున్నారు?

2022-23 విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో పల్నాడు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగింది. గత విద్యా సంవత్సరంలో 76 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈ ఏడాది కూడా 100 శాతం ఉత్తీర్ణత శాతం కోసం ప్రత్యేక కార్యచరణ చేపట్టాం. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.పూర్తి స్థాయిలో అధ్యాపకులు, వార్డెన్లు సిబ్బంది ఉన్నారు. అందరి సహాయంతో లక్ష్యం మేరకు పని చేస్తున్నాం.

వసతి గృహాలపై ఏసీబీ దాడులపై మీ సమాధానం?

పల్నాడు జిల్లా ఆవిర్భావం అనంతరం ఎక్కడా ఏసిబి దాడులు జరగలేదు. సాధారణ తనిఖీలలో భాగంగా వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌కు మెమో ఇవ్వడం జరిగింది. చిన్న చిన్న పోరాబాట్లకు పాల్పడిన వారిని మందలించి సలహాలు సూచనలు చేశాం. గతంలో ఈపూరు ఎస్టి హాస్టల్లో ఏసీబీ దాడులు జరిగి వార్డెన్ సస్పెండ్ అయ్యారు.

వార్డెన్లు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించరని వాచ్ మెన్‌లే అన్ని చూసుకుంటారని ఆరోపణలు ఉన్నాయి?

అటువంటిది ఏమి లేదు. పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఏమైనా సమస్యలు నెలకొంటే ఆయా సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం ద్వారా త్వరితగతిన పరిష్కారం అందుతుంది.

చెస్‌తో మేధో సంపత్తి అభివృద్ధి

రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలను ప్రారంభించి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు

ప్రజాశక్తి- మాచర్ల

మాట్లాడుతున్న ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు

చిన్నతనం నుంచి చెస్ ఆడటం అలవాటు చేసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి నర్సరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ది ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియోషన్, పల్నాడు చెస్ అకాడమీల ఆధ్వర్యంలో పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి చందరంగం పోటీలను మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలసి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించి మాట్లాడారు. చెస్ ఆడటంలో నైపుణ్యం కలిగిన వారు ఇతరులతో పోలిస్తే మానసిక చురకుదనం ఎక్కువగా కలిగి ఉంటారన్నారు. వీరి మానసిక స్థితి దృఢంగా వుంటుందని, స్వీయ అవగాహన పెరుగుతుందన్నారు. దూరదృష్టి, ఆలోచనా సామర్థ్యం మెరుగుపడుతుందని చెప్పారు. ప్రపంచస్థాయిలో మన దేశం నుంచి ఎందరో చెస్ క్రీడా కారులు తమ సత్తాను చాటుతున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని నేటి క్రీడాకారులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ఎంపి, ఎమ్మెల్యేలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్, పాఠశాల ప్రిన్సిపల్ జె.వి. రామకృష్ణశాస్త్రీ, ఎనుమల కేశవరెడ్డి, డాక్టర్, గుర్రం రాజశేఖర్‌రెడ్డి, గాదె రామకృష్ణారావు, యనమదల వెంకట్రామయ్య, డాక్టర్ కొండవీటి రామకోటయ్య, కెవి. రమణలు, చెస్ కోచ్ కె. కిరణ్ పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' పేరిట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించి, ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చొరవ చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఈనెల ఏడున జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, తెనాలి నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

ఫుట్‌బాట్ టోర్నమెంట్‌కు జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఈనెల 8, 9, 10 తేదీల్లో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు గుంటూరు జిల్లా జట్టు ఎంపికలు ఆదివారం పేరేచర్ల గ్రౌండ్‌లో నిర్వహించారు. గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, జిల్లా సెక్రెటరీ దుర్గామోహన్, కోచ్ బ్రహ్మం, సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల పోటీల్లో జిల్లా ప్లేయర్స్ 45 మంది పాల్గొన్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తెలిపారు.